శ్రీ పి. యస్. శాస్త్రి

ఉటోపియా 2081!

మళ్ళీ ఉద్యోగం పోయింది! విశ్వనాధానికి చిరాగ్గా వుంది! ఎన్ని సార్లిలా? ఈ "లీవ్ వేకెన్సీ టెంపరరీ" వుద్యోగాలనుంచి తనకు విముక్తిలేదా? ఈ జన్మకు తమ పెర్మనెంటు వుద్యోగంలో స్థిరపడ లేడా? విసుగు—కోపం—నిస్పత్తువ—నిస్సహాయత — విశ్వనాధాన్ని ముంచెత్తుతున్నాయి.

మళ్ళీ ఎన్నాళ్ళు పడుతుందో మరో టెంపరరీ వుద్యోగం దొరక డానికి! సగటుమనిషి భారతదేశంలో యాభై యేళ్ళు జీవిస్తాడంటారు! అందులో సగంపైన చదువుకోవడంలో, ఉద్యోగాల వేటలో గడిచిపోతే యింక జీవితంలో సారం యేం వుంది? ఇటువంటి గొడవలు, గోలలు లేనికాలంలో పుట్టివుంటే ఎంత హాయిగా వుండేదో! అసలీ గోలలు లేని లోకం లేదా ఎక్కడా?

ఎండలో నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్న విశ్వనాధానికి తల తిరుగుతున్నట్టనిపించింది...కళ్ళు చీకట్లు కమ్మాయి. చాప చుట్టలా క్రిందపడ్డాడు.

ఎంతోసేపటికి కళ్ళు తెరచిన విశ్వనాధానికి తన మనస్సంతా ఆనందంతో నిండి, శరీరం తేలికై, ఎక్కడికో తేలిపోతున్నట్టు అని పించింది. వంటికి పరుపు మెత్తగా తగులుతోంది!

గదిచుట్టూ ఎటు చూసినా పాలరాతితో చేసినట్టున్న తెల్లటి గోడలు మెరిసిపోతున్నాయి. గది గుమ్మాలకు మల్లెపూలంత తెల్లటి తెరలు! అవి పాతకాలపు కథల్లో వర్ణించే చీని చీనాంబరాలో, ఢక్కా మస్లిన్‌లో తెలియడంలేదు!

ఎక్కడనుండో మంద్రస్థాయిలో మనోహరమైన సంగీతం వినిపిస్తోంది. ఆ సంగీతం ఎంతో ఆనందం కలిగిస్తూ ఎన్నిరోజులేనా, నిద్రాహారాలు మాని అలా వినాలనిపిస్తోంది!

తన ఆనందాన్ని ఎవరితోనేనా పంచుకుంటే బావుండుననిపిం చింది విశ్వనాధానికి. అసలు తను ఆ గదిలోకి ఎలా వచ్చాడో తను బ్రతికి వున్నాడో, చచ్చిపోయి మరో లోకం చేరాడో కూడా తెలుసు కోవాలనిపించింది.

అతనికి ఎవరినేనా కలుసుకుని మాట్లాడితే బావుండుననిపిం చిన మరుక్షణమే, ఎవరో ఆ గదివైపు నడిచివస్తున్న శబ్దం విని పించింది!

ఆ వచ్చినవాళ్ళు అత్యంత సుందరంగావున్న యువతులు! వాళ్ళు విశ్వనాధం చూసిన సినిమాల్లోని దేవకన్యల్లా వున్నారు! వడ్డాది పాపయ్యగారి బొమ్మల్లా వున్నారు!

"నేనెక్కడ వున్నాను? మీరెవరు?" ఎంత వద్దనుకున్నా, సినిమాల్లోని డైలాగుల్లానే అడిగాడు వారిని విశ్వనాధం.

"నువ్వు కోరుకున్న లోకంలో వున్నావు! మేము నీవు కోరు కున్న సుఖాలను అందించడానికి వచ్చినవాళ్ళం!" ముసిముసిగా నవ్వుతూ వాళ్ళు తమ చేతుల్లోని బంగారు పళ్ళేరాలను అక్కడి దంతపు బల్లలమీద పెట్టారు. వాటినిండా సన్నజాజుల దండలు, కస్తూరి జవ్వాజిలాంటి సుగంధద్రవ్యాలు, చందనం, వగైరా లున్నాయి!

"...వీళ్ళెవరు? తెలుగులోని గొప్ప నాటక కర్తల డైలాగు ల్లోలా యింత గుంభనగా, గంభీరంగా మాట్లాడుతున్నారేమిటి? అడిగినదానికి తిన్నగా జవాబివ్వకూడదూ?" తనలో తనే విసుక్కు న్నాడు విశ్వనాధం.

"అడగ్గానే తిన్నగా జవాబిస్తే సంభాషణలో సొగసుపోతుంది. వినేవాళ్ళకి సస్పెన్సు పోతుంది! అందుకే తిన్నగా జవాబివ్వకూడదు! అలా జవాబివ్వనందుకు నువ్వు మనస్సులో కూడా విసుక్కోకూడదు!" నవ్వుతూ అందో అందాల సుందరి!

విశ్వనాధం ఖంగుతిన్నాడు! తన మనసులో ఆలోచనలు, పెదవి దాటి మాటలుగా వెలువడకుండానే వీళ్ళు చదివేసి జవాబులు చెప్పే స్తున్నారు! చాలా అసాధ్యుల్లా వున్నారు! వీళ్ళు ఇలా మనసులో మాటలు చదివేస్తూంటే తనకు చాలా కష్టం! మనసులో పుట్టే 'సెక్స్' గురించిన వెధవాలోచనలను పసిగట్టేరంటే వాళ్ళు హూనం చేసెయ్యగలరు?

"నిజమే! అసాధ్యులమే! నువ్వు జాగ్రత్తగా వుండటమే మంచిది!" మరో అమ్మాయి అంది నవ్వుతూ!

"బ్రతికించారు! ఆ తరువాత విషయం గురించి ప్రస్తావించ లేదు!" అనుకున్నాడు విశ్వనాధం.

"నువ్వు సిగ్గుపడుతున్నావనే ప్రస్తావించలేదు!" మరో అమ్మాయి అంది అతనికేసి చిలిపిగా చూస్తూ!

పాతికేళ్ళ విశ్వనాధం పదేళ్ళ కుర్రవాడిలా ముడుచుకుపోయాడా మాటలకి!

"పాతికేళ్ళ యవ్వనంలోఉన్న కుర్రాడివి! అలా ఆడపిల్లలా సిగ్గుపడిపోతున్నావేమిటి? కమాన్ యంగ్ మాన్! మాటలు రావా నీకు? అందమైన అమ్మాయిలు చుట్టూ పరివేష్టించిఉంటే మీ జానపద సినిమాల్లో మహారాజుల్లా పరిచర్యలు చేయించుకోవాలను కున్నావుగా? ఎన్నోసార్లు కలలు కన్నావుగా? ఇంతాచేసి అలాంటి

పరిస్థితుల్లో సుఖంగా మారిపోయావేమిటి ? ఏం మగాడివయ్యా నువ్వు ?''

ఓ అందాల చిన్నది జయమాలినిలా కవ్వించింది అతన్ని !

అప్పటికి కొంచెం తేరుకున్నాడు విశ్వనాథం !

''అన్నీ నిజమే కాని అమ్మాయిలూ ! మీ మనసుల్లోని ఆలోచనలు నాకు తెలియకుండా నా మనస్సులోని మాటలు మాత్రమే మీకు తెలియచెయ్యటం అన్యాయంకాదూ?'' చిరునవ్వుతో అన్నాడు.

''అమ్మయ్య ! మమ్మల్నిచూసి మైమరచి మాట పడిపోయిందేమో, డాక్టరును పిలవాలేమో అనుకున్నాను ! ఫరవాలేదు !'' ఓ చిన్నది చిలకలా పలికింది.

''పెద్ద ! మీరంత గొప్పగా యేం లేరు ! మా జయప్రద, జయసుధ, శ్రీదేవిలు మీకంటే అందంగానే వుంటారు మా సినిమాల్లో ! మీరు వాళ్ళముందు తీసికట్టే !'' రోషంగా అన్నాడు విశ్వనాథం !

''జననీ జన్మభూమిశ్చ...'' అని మొత్తానికి నువ్వు పుట్టిన తెలుగుదేశం, తెలుగుజాతి, తెలుగు సినిమాలమీద నీకున్న అభిమానానికి సంతోషించాం ! మా ఆతిథ్యం స్వీకరించు ! ఆ తర్వాత నీ ప్రశ్నలకు జవాబులు మెల్లిమెల్లిగా తెలుసుకుందువుగాని !

ఆ అమ్మాయిలు అతనిమీద పన్నీరు జల్లుతూ, చిరునవ్వుల పువ్వుల్తో కొడుతూ, సన్నజాజుల, మల్లెపూల దండలతో అతన్ని అలంకరించి; అతను ఎప్పుడూ తిని వుండని రకరకాల పరిమళాలతో, అతిలోకపు రుచులతో నిండివున్న పదార్థాలను పళ్ళేలలో వడ్డించి, కొసరి కొసరి తినిపించారు !

ప్రక్కన కూర్చుని హాస్యాలాడుతూ, చతురోక్తులతో అతన్ని తన్మయుణ్ణి చేసారు.

అలా ఎంతసేపు గడిచిందో అతనికే తెలియదు. కళ్ళు మూతలు పడుతూంటే వో అందాల సుందరిని చెయ్యి పట్టుకుని మీదకు లాక్కున్నాడు. ఆమె కాదనకుండా అతని కౌగిలిలో కరిగిపోయింది !

ఇలా ఎన్నాళ్ళు గడిచాయో కూడా మొదట విశ్వనాథం గుర్తుపెట్టుకోడానికి ప్రయత్నించలేదు. కాని కొన్నాళ్ళుపోయాక యీజీవితం విసుగెత్తించినట్టనిపించేసరికి మళ్ళీ పాత ప్రశ్నను వాళ్ళమీద ప్రయోగించాడు.

''అబ్బ ! అరిగిపోయిన గ్రామఫోను రికార్డులా అస్తమానం ఆ ప్రశ్న యెందుకు ? ఇది యేదో వో లోకం ! మేం ఎవళ్ళమో, యీ లోకంలోకి నీవెలా వచ్చావో, యీ ప్రశ్నలన్నీ యెందుకు నీకు ? అన్ని ప్రశ్నలు, ఆలోచనలు మాని, సుఖంగా వుండలేవు ? ఏం మనుషులో ఏమిటో ! సుఖం లేనన్నాళ్ళు సుఖం కావాలో అని గోలకెత్తుతారు ! తీరా ఆ సుఖం అనుభవంలో కొచ్చేసరికి సమస్త ప్రశ్నలూ వేస్తారు ! అన్ని అనుమానాల్తో బాధపడలేరు ! మళ్ళీ ఉదయం సాయంత్రం 'నిష్కామకర్మ' అంటూ భగవద్గీతలో శ్లోకాలు వల్లిస్తారు. అటువంటి వో నిష్కామకర్మగానే 'సుఖపడటం' చెయ్యలేరు!''

మా అభిమానులు, ఖాతాదారులు, శ్రేయోభిలాషులకు

నూతన తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు.



విసుక్కుంది అతని అందాల ప్రేయసి !

ఆ దెబ్బకు హడిలిపోయాడు విశ్వనాథం ! మళ్ళీ కొన్నాళ్ళు ప్రశ్నలు వేయలేదు !

కాని యీ జీవితం అతనికి విసుగెత్త సాగింది. మళ్ళీ నోరోజు "మీరెవరు? నే నెందుకిక్కడ కొచ్చాను ? ఎలా వచ్చాను ?" అన్న ప్రశ్నల్ని మళ్ళీ వేశాడు !

"పోనీ చెబుదామే! చెప్పకపోతే బెంగతో చచ్చిపోయేలా వున్నాడు!" ఆ సుందరీమణుల్లో నో అమ్మాయి అంది.

"సరే నీ యిష్టం !" అయిష్టంగానే ఒప్పుకున్నారు మిగిలిన వాళ్ళు.

"నువ్వెప్పుడేనా 'టైమ్ మెషీన్' అన్న హెచ్. జి. వెల్స్ కథ చదివావా?" ఓ అమ్మాయి ప్రశ్నించింది అతన్ని.

"విన్నాను! కథ బాగుందని చాలాసార్లు అనుకున్నాను. అలా జరిగితే ఎంత బావుంటుందో అని కలలు గన్నాను !" విశ్వనాథం విస్మయంతో అన్నాడు, టైమ్ మెషిన్‌కూ వీళ్ళకూ సంబంధం ఏమిటో తెలియక.

"అందులోవున్న టైమ్ మెషిన్‌లాంటిదాన్ని మీ ఇండియా లోనే వున్న నొక శాస్త్రవేత్త తయారుచేసాడు. అది ఎవరిమీదైనా ప్రయోగించడానికి భయం వేసిందాయనకి. చివరకి నువ్వు కనిపించావు. నీమీద ప్రయోగించాడు! ఆ 'మెషిన్' కాలంలో ముందుకూ వెనక్కూ వెళ్ళగలదని నీకూ తెలుసుగదా! అలా నువ్విప్పుడు 'ఇండియా క్రీ. శ. 2081'లో వున్నావు. అంటే మేమంతా క్రీ. శ. 2081 వాళ్ళం! నువ్వు క్రీ. శ. 1981లోంచి హటాత్తుగా 2081లోకి అడుగుపెట్టడంవల్ల నీలో పాత వాసనలు పోలేదు !"

ఓ అమ్మాయి వివరించింది అతనికి.

విశ్వనాథానికంతా వింతగావుంది. 'వెల్స్' సరదాగా కథ అల్లాడని అనుకున్నాడు గాని తను అది సాధ్యపడుతుందని ఎప్పుడూ అనుకోలేదు.

అసలు వీళ్ళు చెప్పిందంతా నిజమేనా ? ఇదంతా తనమీద ప్రయోగించబడుతున్న నో పెద్ద ఇంద్రజాలం కాదుగదా ! లేక తను యేదేనా పెద్ద కలను కంటున్నాడా ? వీళ్ళు తాము చెప్పినట్టుగా '2081'లో వాళ్ళా లేక మహాభారతం కథలో నాగకన్య ఉలూచి అర్జునుణ్ణి నాగలోకానికి తీసుకుపోయినట్టు తననుయిక్కడికి యెత్తుకు వచ్చిన కామపిశాచులా ?

విశ్వనాథం తనలో తనే గుంజాటన పడుతున్నాడు.

"నీ అనుమానాన్నిప్పుడే పటాపంచలు చేస్తామోయ్ విశ్వనాథం!" మరో అమ్మాయి అంది అతని చెయ్యి పట్టుకు లాగుతూ!

మరో అమ్మాయి హటాత్తుగా అతనిబుగ్గ పట్టుకు కొరికింది మెత్తగానే!

"అమ్మా!" అని బాధతో బుగ్గ తడుముకున్నాడు విశ్వనాథం!

"కనుక నువ్వు కలగనటం లేదని నీ కర్థమైందికదా!" మరో సుందరి కిసుక్కున నవ్వింది.

"బైటకు రా! యిక్కడి వింతలు చూపిస్తాం !" ఆ అమ్మాయిలు అతన్ని మృదువుగా ప్రక్కమించి లేపి నూతన వస్త్రాలతోటీ, పూల హారాలతోటి, సుగంధ ద్రవ్యాలతోటి అలంకరించారు.

"ఆంధ్రుల అభిమాన సినిమా హీరోలకంటే గొప్ప అదృష్టం పట్టింది నాకు!" విశ్వనాథం మురిసిపోయాడు, బయటకు నడుస్తూ.

ఎదురుగా పెద్ద మైదానం ! వెన్నెల్లాంటి మెత్తటి కాంతి అంతటా ఆవరించివుంది. ఆ మైదానంలో రంగురంగుల పకులు, చక్కటి కంఠంతో కూస్తూ ఎగురుతున్నాయి. రంగురంగుల హరివిల్లులు అన్నివైపులా మెరుస్తున్నాయి దిగంతాలలో ! దివ్యవాదాలు అన్నివైపుల్నించీ వినిపిస్తున్నాయి.

"ఆ పకులు మేం తయారుచేసినవే ! ఆ హరివిల్లుల్ని యెప్పుడువడితే అప్పుడు ఆకాశంలోకి ప్రసరించగలం ! చంద్రుడు లేకుండా వెన్నెలని సృష్టించగలం ! మధుర నాదాల్ని యెంత దూరమైనా సమ్మోహనకరంగా సంపి వినిపించగలం !"

గర్వంగా చెప్పింది ఓ సుందరి !

ఓవైపున ఆ మైదానంలో పెద్దపందిరి వేసివుంది. వెండి స్తంభాలకు బంగారు తోరణాలు కట్టివున్నాయి. పందిరినుండి వజ్రాలూ, మాణిక్యాలూ, మరకతాలు, నీలాలూ ప్రేలాడగట్టివున్నాయి.

వాటిని చూస్తూనే విశ్వనాథం అదిరిపడ్డాడు.

"అవి నిజం వెండి, బంగారు వస్తువులే ! ఆ మరకత మాణిక్యాలు అన్నీ నిజమైనవే ! కాకపోతే వాటిని కృత్రిమంగా తయారుచేశాం ! వాటివి టన్నుల్లో చవగ్గా ఉత్పత్తిచేసేసరికి, వాటిని కొనేవారూ, అమ్మేవారూ లేరు ! ప్రజలకు వాటిమీద మోజు పోయింది !" ఓ అమ్మాయి వివరించి చెప్పింది.

హంసతూలికా తల్పాల్లాంటి వాటిమీద సభికులు విశ్రమించి వున్నారు. వారిచేతుల్లో వున్న స్ఫటికపు గ్లాసుల్లో బంగారురంగు ద్రవాలు మధుర పరిమళాన్ని గుబాళిస్తూ వున్నాయి. వాటిని మెల్లి మెల్లిగా త్రాగుతూ వాళ్ళు ఎదురుగావున్న పెద్ద రంగస్థలంమీద ప్రదర్శించబడుతున్న నృత్యాలు, నాటకాలను ఆనందంగా చూస్తున్నారు. అవన్నీ మనకళ్ళ కెదురుగా నిజజీవితంలో వున్న దృశ్యాల్లో కదులుతూ కనిపిస్తున్నాయి.

తమకు నచ్చిన అంశాలు వచ్చినప్పుడు సభికులు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేస్తున్నారు.

అదంతా కొంతసేపు చూశాక విశ్వనాథానికి విసుగేసింది.

"నీకు విసుగ్గా వున్నట్టుంది ! ఈ ప్రక్కకెడదాం రా !" మహాసుందరి మరోవైపుకు తీసుకువెళ్ళిందతన్ని.

"దీనికి సంగీతం గోల" మొదటి అమ్మాయి విసుక్కొంది ఆమెను.

"నేను రాను మీరు వెళ్ళండి!" అంది నృత్యాలు చూస్తూ.

వేరేవైపున మొదటి రంగస్థలంకంటే చిన్నరంగస్థలం వుంది. కాకపోతే యిక్కడ రకరకాల సంగీత కచేరీలు జరుగుతున్నాయి. ఇంత వరకూ గాలిలో మంద్రంగా తేలివస్తున్నట్టు వినిపిస్తున్న మధుర నాదాలు యిప్పుడు ప్రస్ఫుటంగా వినిపిస్తున్నాయి.

హిందుస్తానీ, కర్నాటక, పాప్, జాజ్, రాకెన్‌రోల్ అవీ యివీ అనికాదు! అన్ని రకాల సంగీత కచేరీలు జరుగుతున్నాయి! ఎవరి కిష్టమైన సంగీత కచేరి వచ్చినప్పుడు వాళ్ళు రెట్టింపు ఉత్సాహంతో చప్పట్లు చరుస్తున్నారు.

విశ్వనాథానికి అక్కడా విసుగేసింది.

"నీకు యిక్కడా విసుగ్గావుంది! అవైపుకు వెడదాం రా!" మరో అమ్మాయి అంది.

"దానికి కవిత్వం పిచ్చి!" రెండో అమ్మాయి విసుక్కుంది మూడో అమ్మాయిని.

ఒకవైపు వేదికమీద కవితాగానాలు సాగుతున్నాయి. కాకపోతే యీ వేదిక గుండ్రంగా నిర్మించబడింది! ప్రేక్షకులవి చక్రాలకుర్చీలు! ఎవరి భాషా కవితాగానం వున్నవైపుకు వాళ్ళు తమ మరకుర్చీల్లో వెళ్ళి వింటున్నారు. ఎన్నెన్ని భాషలలో కవిత్వాలు వినిపిస్తున్నా యక్కడ!

అందాల సుందరులతో పాడి మాటలు మాట్లాడటంతప్ప మరేమీ చెయ్యని విశ్వనాథానికి తెలుగు కవితాగానం వినగానే వొళ్ళు పులకరించింది. మనస్సు పరవశించిపోయింది.

కొంతసేపయ్యాక అతనికి విసుగేసింది!

"ఇంకా ఏంకావాలి నీకు?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది అతన్ని నాలుగో అమ్మాయి.

"ఇంతే? ఇంతేనా? ఇంకేంలేదూ?" విశ్వనాథం ప్రశ్నించాడామెను.

"ఇంకా ఏం కావాలి? ఇక్కడ నువ్వు కోరుకున్నట్టుగానే తిండికి, గుడ్డకు, వసతికి, ఆనందానికి దేనికీ లోటులేదు! ఇంతకంటే ఇంకా ఏంకావాలి?" విసుగ్గా అందా అమ్మాయి.

"అందరూ యిలాగే వుంటారా? ఇదే అందరి జీవితమూనా?" విశ్వనాథం ప్రశ్నించాడు ఏదో ఆలోచిస్తూ.

"అంతే!" వెల్ఫేర్‌స్టేట్, "సర్వమానవ సమానత్వపూర్వక శ్రేయో రాజ్యం" అంటే యింతకంటే మరేమిటి? ఎదురు ప్రశ్నించిందామె!

"నేనూ అందరిలాంటివాడినేనా? ఏమీ తేడా లేదా? నా వ్యక్తిత్వం, ఆలోచనలు, అభిరుచులు, వీటికేం విలువలేదా?" ఏడుపు మొహంతో ప్రశ్నించాడు విశ్వనాథం!

"అంతే! నువ్వు అందరిలాంటివాడివే! నీ గొప్పేముంది!" వెక్కిరించిందా అమ్మాయి.

"ఇక్కణ్ణుంచి కష్టపడి, మరెక్కడికైనా, యింకా అందమైన లోకంలోకి..."

"ఎందుకు కష్టపడటం? ఈ సుఖం చాలదూ?"

"ఇక్కడ వృద్ధత్వం, అనారోగ్యం ఇలాంటివేవీలేవూ?"

"ఏమీలేవు! అన్నింటినీ జయించాం! నిత్య యవ్వనం, నిత్యానందం! ఇదేగా మీ దేశంవాళ్ళు కోరుకునేదీ, మీ పూర్వులు యజ్ఞాలుచేసి సాధించాలనుకున్నదీను!" చిరాగ్గా జవాబిచ్చింది ఆ సుందరి!

"ఇలా బ్రతకడం విసుగుపుడితే ..." భయపడుతూనే అడిగాడు విశ్వనాథం!

"ఇది కష్టమని ఎవరికీ అనిపించదు! ఎవరేనా వో పిచ్చివాడికి అలా అనిపిస్తే ఆ మైదానం చివరవున్న గదిలోకి వెళ్ళి స్విచ్చి నొక్కితేచాలు! మరుక్షణం శూన్యంలో కలిసిపోతాడు!"

మా ఖాతాదారులకు శ్రేయోభిలాషులకు

మా శుభాకాంక్షలు

"అది 'చచ్చిపోవడం' ఆత్మహత్య కాదూ?"

"కాదు! స్వేచ్ఛగా, యీ విశ్వంలో కష్టంలేకుండా లీన మవడం! మీ భారతంలోకూడా భీష్ముడికో యెవడికో అతని తాతో, తండ్రో అలాంటి 'యిచ్ఛామరణం' వరంగా ప్రసాదించాడట గదా! హాయిగా ఏబాధా లేకుండా, గాల్లో కలవటం 'చావు' అనే భయంకర విషయం ఎందుకవుతుంది? ఇంకచాలు! ఇప్పటికే చాలాసేపు మాట్లాడాం!" ఆగిందామె.

"రా! హాయిగా వుందాం! ఏ ఆలోచనలు పెట్టుకోకు! సుఖాన్ని అనుభవించటం నేర్చుకో! అవకాశం వచ్చినప్పుడు ఏ ఆలోచనలు లేకుండా అనుభవాల నందిపుచ్చుకోవడమే యీ—2081 అలవాటు." అతన్ని గదిలోకి లాగుతూ అందామె!

గదిలోకి వచ్చినా విశ్వనాథం ఆలోచించకుండా వుండటానికి ప్రయత్నిస్తూనే ఆలోచిస్తున్నాడు. మనసుకు శాంతి లభించటంలేదు!

ఒకరోజు, రెండు రోజులు, మూడు రోజులు ... ఎన్నాళ్ళిలా నిర్వ్యాపారంగా గడపడం? ఏ రకమైన బాధా, కష్టం, ప్రయత్నం ఏవీ లేకుండా, గానుగెద్దు బ్రతుకులా బ్రతకడమేనా? ఇలా బ్రతకడంవల్ల ఏమిటి ప్రయోజనం?...తను సాధించవలసినవి కాని, సాధించానన్న తృప్తి పొందటానికి అవకాశాలుకాని లేవు! గొర్రెల మందలో వొకడిగా బ్రతుకుతూ వుండటమేనా? తనదంటూ వో జీవితంకాని, తను నలుగురికంటే భిన్నంగా, సాహసవంతంగా బ్రతక డానికిగాని అవకాశమే లేదు!

విశ్వనాథాన్ని యీ ఆలోచనలే తినేస్తున్నాయి! అసంతృప్తి అతన్ని తొలిచేస్తోంది! ఇలా కాదు యీ బ్రతుకు తనకు నచ్చటం లేదు. పురుషప్రయత్నానికి అవకాశంలేని యీ సమాజం తనకొద్దు అనుకున్నాడు.

"ఎందుకు విశ్వనాథం అనవసరపు ఆలోచనలు! ... మాలా హాయిగా కాలం గడిపివెయ్యలేవూ?" ... ఆ సుందరీమణులు అతన్ని జాలిగా ప్రశ్నించేవారు.

విశ్వనాథం జవాబిచ్చేవాడు కాదు.

ఒకరోజు మైదానం వేపుకు వెళ్ళాడు. అటూ యిటూ నడుస్తూనే శూన్యమందిరంవైపుకు పరిగెట్టుకు వెళ్ళాడు.

"విశ్వనాథం అటు వెళ్ళకు! ఇటురా! వెళ్ళకు!" ఆ సుందరీమణులు అతన్ని వెనక్కి పిలుస్తున్నారు.

"నేను రాను! నేను శూన్యంలో కలిసి మళ్ళీ మా లోకంలో జన్మిస్తా! నా కష్టాలు, నా దుఃఖాలు, వాటిని అధిగమించటంలో నాకు లభించే తృప్తి యివి కావాలి నాకు! సుఖం, దుఃఖం, మానవ ప్రయత్నానికి విలువ, మానవులకొక్కొక్కరికీ వుండే విలక్షణ వ్యక్తిత్వం కావాలి నాకు! ఈ సర్వసమానత్వ 'మోనాటనీ' ని నేను భరించలేను! నా లోకమే నాకు కావాలి! ఎన్ని కష్టాలు పడినా, ఏదో వొకనాటికి సుఖిస్తాననే ఆశ, సుఖాన్ని సాధించానన్న విజయ గర్వం, కావాలి నాకు! ఎన్నిసార్లయినా, మా లోకంలోనే జన్మిస్తాను" అరుస్తూ విశ్వనాథం స్విచ్చినొక్కాడు!

శూన్యం ... శూన్యం ... మహా శూన్యం ... తను ఏదో అయిపోయాడు.

...ఇదేమిటీ ఎవరివో మాటలు వినిపిస్తున్నాయి! ... ఎక్కడున్నాడు తను? ... మళ్ళీ తనలోకంలో కొచ్చేశాడులావుంది! విశ్వనాథం ఆలోచనలో పడ్డాడు.

"పాపం ... మొహం తిరిగి పడిపోయినట్లున్నాడు! కాసిని నీళ్ళు జల్లండి మొహాన్ని...లేస్తాడు!"

"కొంచెం కాఫీని పట్టించండి! నీరసం మూలాన్ని పడ్డాడో యేమో!"

"ఈ అరుగు మీద పడుకోపెట్టండి! కొంచెం గాలి తగల నివ్వండి!"

విశ్వనాథం మెల్లగా కళ్ళు విప్పాడు!

ఆశ్చర్యం! ఇది తన లోకమే! తన లోకాన్ని దర్శించ గానే అతనికి ఆనందం వుప్పొంగింది! అయితే తను శూన్యంలో కలిసి మళ్ళీ క్రొత్తగా పుట్టలేదు! పాతికేళ్ళ విశ్వనాథం లానే వున్నాడు! అంటే తను యింతకు ముందు చూసిన లోకంలో శూన్యంలో కలవ లేదన్నమాట! అయితే కలగన్నాడాతను?

"ఏం జరిగిందయ్యా! నడిరోడ్డు మీద చాపచుట్టలా పడి పోయావ్! నీ అదృష్టం బావుంది... కొద్దిలో పెద్దప్రమాదం తప్పింది! లారీ అవతలగా పోయింది! కాస్త జాగ్రత్తగా వుండు!" ఒకాయన హెచ్చరించాడు.

"అలాగే! అలాగేనండి!" తనలో ఉబికివస్తున్న ఆనందాన్ని, ఉత్సాహాన్ని అణచుకుంటూ అన్నాడు విశ్వనాథం.

అందరూ ఎవరిదారిని వాళ్ళు వెళ్ళారు.

"ఎంత పెద్దకల! ఎంతగమ్మత్తైన కల! ఎంత వింత అనుభవం కలిగింది కొద్ది క్షణాల్లో నాకు! నాకు నిర్వ్యాపారత, కష్ట పడకుండా వచ్చే సుఖం వద్దు! రేపు మరో మంచి వుద్యోగం లభిస్తుంది! ఏదీ కాకపోతే నేనే ఏదో ఒక చిన్న వ్యాపారం ప్రారంభిస్తా! మనిషి తలుచుకోవాలే కాని సాధించలేనిది ఏమిటి? కావలసిందల్లా పట్టుదలే! దాన్ని నాకు ప్రసాదించిన యీ కల యెంత గొప్పది!... థాంక్యూ ఉటోపియా 2081!...థాంక్యూ వెరీమచ్! నా జీవితం లోని మాధుర్యం నాకు తెలియజెప్పావ్!" నవ్వుకుంటూ ఆనందంగా తనలో తనే ఏదో మాట్లాడుకుంటూ పోతున్న విశ్వనాథాన్ని, జనం వింతగా చూస్తున్నారు!